క్లుప్తంగా

ప్రజలకు శుద్ధజలం అందించాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో గోవింద్

సోన్: మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రజలకు శుద్ధజలం అందించాలని జెడ్పీ సీఈవో గోవింద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో సోన్, నిర్మల్‌రూరల్ మండలాల్లోని ఆయా గ్రామాలకు చెందిన మంచినీటి సహాయకులకు రెండోరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పైపులైన్లకు లీకేజీలు ఏర్పడితే ఎప్పటికప్పుడు శుభ్రం చేసి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలని పేర్కొన్నారు. ఎంపీడీవో సురేశ్, మిషన్ భగీరథ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో బోరు ఏర్పాటు

ఖానాపూర్: పట్టణంలోని నాలుగో వార్డు పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీలో తాగునీటి బోరు పనులను మంగళవారం ప్రారంభించారు. నీటి సమస్య పరిష్కరించాలని కౌన్సిలర్ విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ చొరవతో బోరు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ మనోహర్ తెలిపారు. నాయిని సంతోష్, వెంకటేశ్వర్లు, లింగేశ్, శ్రీకాంత్ తది తరులు ఉన్నారు.

కారు, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

లక్ష్మణచాంద: మండలంలోని నర్సాపూర్ చెక్‌పోస్టు సమీపంలో ఓ కారు బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరు గాయపడిన ఘటన చోటు చేసుకుంది. ఎస్సై సుమలత వివరాల ప్రకారం జిల్లా కేంద్రానికి చెందిన దేగం మధుకర్ మంగళవారం ఉదయం 9:30 గంటలకు నిర్మల్ నుంచి కారు నడుపుతూ మామడ వెళ్తున్నాడు. మహారాష్ట్రకి చెందిన మారుతి(30) మామడ నుంచి నిర్మల్ వైపు బైక్‌పై వెళ్తున్నాడు. నర్సాపూర్ చెక్‌పోస్ట్ వద్ద కారు మారుతి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో మారుతి చేతులు, కాళ్లకు, మధుకర్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్‌కు జరిమానా

ఖానాపూర్: అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా మొరం ట్రాక్టర్‌లో తరలిస్తుండగా మండలంలోని రంగపేట గ్రామానికి చెందిన భూమన్నను పట్టుకున్నట్లు ఎఫ్ఆర్‌వో కిరణ్ తెలిపారు. ట్రాక్టర్‌కు రూ.20 వేల జరిమానా విధించామని పేర్కొన్నారు. అటవీ ప్రాంతంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బైక్ చోరీ

భైంసాటౌన్: పట్టణంలోని రాంనగర్‌లో ఓ ఇంటి ముందు నిలిపి ఉంచిన బైక్ చోరీకి గురైంది. బాధితుడి కథనం ప్రకారం.. స్థానిక మున్సిపాలిటీలో కార్మికుడిగా పని చేసే నర్సయ్య సోమవారం రాత్రి తన ఇంటి ఎదుట బైక్ నిలిపి ఉంచాడు. మంగళవారం ఉదయం లేచి చూసేసరికి వాహనం కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు.

'రాజకీయ లబ్ధి కోసమే తప్పుడు ఫిర్యాదు'

ఖానాపూర్: ఖానాపూర్ మున్సిపాలిటీలో అభివృద్ధిని ఓర్వలేకనే ప్రతిపక్ష బీఆర్ఎస్ కౌన్సిలర్లు కలెక్టర్‌కు తప్పుడు ఫిర్యాదు చేశారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేశ్, నాయకులు షబ్బీర్‌పాషా, పరిమి సురేశ్, సచిన్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. వార్డు సమస్యలపై సదరు కౌన్సిలర్లకు కనీస అవగాహన లేదన్నారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో పట్టణానికి రూ.4.80కోట్ల నిధులు మంజూరయ్యాయని.. అన్ని వార్డులను అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

వంతెనకు మరమ్మతులు



వంతెనపై సాగుతున్న రెయిలింగ్ పనులు

భైంసాటౌన్: మండలంలోని వానల్‌పాడ్ వద్ద జాతీయ రహదారిపై కొద్దినెలల కిందట లారీ ఢీకొని వంతెనపై రెయిలింగ్ దెబ్బతింది. దీంతోపాటు హైవే అస్తవ్యస్త నిర్వహణపై 'సాక్షి'పలుమార్లు కథనం ప్రచురించింది. దీంతో ఎట్టకేలకు హైవే నిర్వాహకులు మరమ్మతులు ప్రారంభించారు. వానల్‌పాడ్ వద్ద వంతెనపై రెయిలింగ్ నిర్మాణంతోపాటు రహదారి వెంట పిచ్చిమొక్కలు, మట్టి తొలగింపు పనులు చేపడుతున్నారు.

గణిత మేళాలో ప్రతిభ

భైంసాటౌన్: ఆదిలాబాద్‌లో నిర్వహించిన శ్రీసరస్వతి శిశుమందిరాల విభాగ్‌స్థాయి గణిత విజ్ఞాన మేళాలో భైంసాలోని గుజిరిగల్లి, కిసాన్‌గల్లి పాఠశాలల విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభ కనబరిచారు. మంగళవారం విజేతలను సిబ్బంది భినందించారు. ఈనెల 25న జరిగే రాష్ట్రస్థాయి మేళాలో పాల్గొనున్నట్లు ప్రధానాచార్యులు భోజన్న, గంగాధర్ పేర్కొన్నారు.

లోపం.. అధిగమిద్దాం



కుంటాల మండలం అంబకంటి అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

- చిన్నారులు ఆరోగ్యంగా ఎదిగేలా ప్రభుత్వం చర్యలు
- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పోషణ మాసోత్సవాలు
- 30వ తేదీ వరకు కార్యక్రమాలు

నిర్మల్‌చైన్‌గేట్: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం, మాతాశిశు సంరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఈనెల 1 నుంచి 30 వరకు పోషణ్ అభియాన్ మాసోత్సవం పేరుతో పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఎదుగుదల, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, ఆరోగ్య సంరక్షణ, పెరటి తోటల పెంపకం తదితర అంశాలపై అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలోని 18 మండలాలు, మూడు మున్సిపాలిటీల పరిధిలో 4 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి పరిధిలో 926 అంగన్వాడీ కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాల పరిధిలో ప్రస్తుతం గర్భిణులు 56,854 మంది, బాలింతలు 4,073 మంది ఉన్నారు. ఆరునెలల లోపు చిన్నారులు 4,265 మంది, ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపువారు 30,560 మంది, మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలు 27,919 మంది అంగన్వాడీల ద్వారా లబ్ధి పొందుతున్నారు.

తీసుకోవాల్సిన ఆహారం..

గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తూ.. రక్తహీనత నివారణకు కృషి చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ చాలామంది రక్తహీనతతో బాధపడుతున్నారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం మరింత మెరుగైన పోషకాహారాన్ని తీసుకునేలా వాటి ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తున్నారు. పోషకాలు కలిగిన ఆకుకూరలు, కూరగాయలపై అవగాహన పెంపొందిస్తున్నారు. ప్రధానంగా వంకాయ, బీరకాయ, దొండకాయ, చుక్కకూర, పాలకూర, తోటకూర, గోంగూర వంటి ఆకుకూరలు, పొలం గట్లపై లభించే గునుగు, ఎర్ర గునుగు ప్రాధాన్యతను వివరిస్తున్నారు. ఆకుకూరలు, కాయగూరలు వండి చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందిస్తున్నారు.

ఎదుగుదలపై దృష్టి..

ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షిస్తారు. అందులోని చిన్నారులు ఎంత బరువున్నారు.. వారు వయసుకు తగ్గ ఎత్తు ఉన్నారా.. లేదా అనేది ముందుగా నమోదు చేస్తారు. పోషకాహారం అందించిన తర్వాత ఎంత మేర పెరిగారు. అన్న వివరాలను సేకరిస్తారు. రక్తహీనత తగ్గించి.. పోషక విలువలను పెంచి, మహిళల్లో హిమోగ్లోబిన్ శాతం పెరిగేలా చేయడమే పోషణ్ మాసం ముఖ్య ఉద్దేశం. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారుల భుజం చుట్టు కొలతల విధానాన్ని అనుసరిస్తున్నారు. భుజం వృద్ధి ద్వారా గర్భిణులతోపాటు వారి గర్భంలో ఉన్న శిశువు పెరుగుదల, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని, భుజం చుట్టు కొలతల ద్వారా ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్నారు. ఈ విధానం తీవ్ర పోషకాహార లోపంతో ఉన్న వారిని తేలికగా గుర్తిస్తారు. వారి ఆరోగ్య పరిస్థితిని మెరుగుపర్చేందుకు వ్యక్తిగతంగా కూడా చర్యలు తీసుకుంటున్నారు.

కార్యక్రమాలు ఇలా..

- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, స్థానిక సంస్థలు, వివిధ శాఖలను పోషణ మాసంలో భాగస్వాములను చేస్తూ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రజలు, లబ్ధిదారులతో మమేకమై పోషకాహార ప్రాధాన్యత, రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు.
- శిశువు పుట్టిన క్షణం నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నారు. అనుబంధ ఆహారం గురించి వివరిస్తున్నారు.
- పోషణ్ బీ.. పఢాయ్ బీతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత, కాలానుగుణ వ్యాధులకు గురవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచిస్తున్నారు.
- పోషకాహార లోపంతో వచ్చే వ్యాధులు, శిశువుల బరువు ఆవశ్యకతను గురించి వివరిస్తున్నారు.
- తల్లి పేరిట ఓ మొక్కను నాటే కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు.
- చిన్నారుల్లో ఎదుగుదల పరీక్షించి పోషణ్ ట్రాకర్‌లో నిక్షిప్తం చేస్తారు. పోషణ్ బీ .. పఢాయ్ బీలో భాగంగా పిల్లలకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తారు.

వర్షం.. పంటలకు నష్టం



కుంటాల : విఠాపూర్‌లో సోయాలో నిలిచిన నీరు



లోకేశ్వరంలో నేల కొరిగిన వరి పంట

కుంటాల: మండలంలోని గ్రామాల్లో సోమవారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. పత్తి, సోయా పంటల్లో నీరు నిలువడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. కోత దశకు వచ్చిన సోయా పంట దెబ్బతింది. కల్లూరు చెక్‌డ్యాంపై వరద ప్రవహించింది. మండలంలో మూడు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో సాయికృష్ణ తెలిపారు.

లోకేశ్వరం: మండలంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు 6.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ మోతీరాం తెలిపారు. పత్తి, వరి, సోయా పంటలు నీట మునిగాయి. కొన్ని చోట్ల వరి పంట నేలకొరిగింది.

పారిశుధ్య చర్యలు చేపట్టాలి



దిలావర్‌పూర్‌లో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

దిలావర్‌పూర్: ప్రజలు రోగాల బారిన పడకుండా గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని డీపీవో శ్రీనివాస్.. పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం దిలావర్‌పూర్‌తోపాటు కాల్వ గ్రామ పంచాయతీ, తదితర గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటా తిరుగుతూ ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఎంపీఓ గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, దిలావర్‌పూర్ పీహెచ్‌సీ సీహెచ్‌ఓ రాజేశ్వర్, ఆశా కార్యకర్తలు శోభ, లక్ష్మి, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని బోరిగాం గ్రామంలో సీజనల్ వ్యాధులపై కళాజాత నిర్వహించారు. గ్రామాల్లో ఫాగింగ్ చేపట్టి దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందిని ఎంపీడీవో రాధ ఆదేశించారు. అనంతరం పార్‌పెల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. వర్షపునీరు బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఎంపీవో అమీర్‌ఖాన్, ప్రధానోపాధ్యాయుడు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ (జి): స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా నర్సాపూర్(జి), చాక్‌పల్లి, బూరుగుపల్లి (జి) గ్రామాల్లో మంగళవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో తిరుపతిరెడ్డి, కార్యదర్శులు వీణారెడ్డి, నరేశ్‌కుమార్, శివకుమార్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మామడ: ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించి పచ్చదనం పెంపొందించాలని డీఎల్‌పీవో రమేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని కొరిటికల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మామడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి గ్రామాల్లోని పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగాసాగర్‌రెడ్డి, సూపర్‌వైజర్ శ్యామల, హెచ్ఎం వెంకటరమణారెడ్డి, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మండలాలకు ఎంఈవోల కేటాయింపు

- సీనియర్ హెచ్ఎంలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం

నిర్మల్‌రూరల్: విద్యావ్యవస్థను క్రమక్రమంగా గాడిన పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఇందులో భాగంగా ప్రతి మండలానికి ఆ మండలంలో పని చేసే సీనియర్ హెచ్ఎంలకు ఇన్‌చార్జి ఎంఈవోల బాధ్యతను అప్పగించింది. ఈమేరకు మంగళవారం రాత్రి రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. నూతన జిల్లా ఏర్పడిన తర్వాత ఒక్కో ఎంఈవో నాలుగు నుంచి ఐదు మండలాలకు ఇన్‌చార్జిగా వ్యవహరించేవారు. దీంతో విద్యావ్యవస్థ గాడి తప్పింది. ఇది గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతానికి ఇన్‌చార్జి ఎంఈఓలను నియమించింది.

మండలాల వారీగా..

నిర్మల్‌అర్బన్ మండలానికి ఎంఈవోగా జి.నాగేశ్వరరావు, నిర్మల్‌రూరల్‌కు పి.వెంకటేశ్వర్, సోన్‌కు తుడిశెట్టి పరమేశ్వర్, లక్ష్మణచాందకు అశోక్‌వర్మ, మామడకు వై.వెంకట్‌రమణారెడ్డి, ఖానాపూర్‌కు ప్రేమ్‌సాగర్, సారంగాపూర్‌కు మధుసూదన్, భైంసాకు సుభాశ్, ముధోల్‌కు జి.రమణారెడ్డి, కుభీర్‌కు విజయ్‌కుమార్, తానూరుకు నరేందర్, బాసరకు మైసాజీ, నర్సాపూర్(జి)కి కిషన్‌రావు, దిలావర్‌పూర్‌కు శంకర్, కడెంకు షేక్ హుస్సేన్, పెంబికి రాంచందర్, దస్తురాబాద్‌కు గంగాధర్, కుంటాలకు ముత్యం, లోకేశ్వరం మండలానికి చంద్రకాంత్‌ను ప్రభుత్వం నియమించింది. వీరంతా బుధవారం విధుల్లో చేరనున్నారు.

సభకు తరలిన రేషన్‌డీలర్లు

నర్సాపూర్(జి): హైదరాబాద్‌లోని పటాన్ చెరువు జీఎంఆర్ గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన బహిరంగ సభకు మండలంలోని రేషన్ డీ లర్లు తరలివెళ్లారు. రేషన్ డీలర్ల సంఘం మండలాధ్యక్షుడు చంద్రకాంత్, గంగాధర్, అర్జున్, రాము, సాయన్న, భీమేశ్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

ఖానాపూర్: తమ డిమాండ్ల సాధనకు పటాన్‌చెరులో నిర్వహించిన సభకు మండలంలోని గ్రామాల రేషన్‌డీలర్లు తరలివెళ్లారు. సురేశ్, రాజేందర్, ప్రశాంత్‌రెడ్డి, సాయిరాం, రాజేశ్వర్ ఉన్నారు.

కార్యదర్శిని నిలదీసిన గ్రామస్తులు

భైంసారూరల్: గ్రామంలోని సమస్యలను ఎందుకు పరిష్కరించడం లేదని మండలంలోని బోరిగాం గ్రామస్తులు మంగళవారం పంచాయతీ కార్యదర్శి శ్యామలను నిలదీశారు. 15 రోజులవుతున్నా.. బోరుమోటారుకు మరమ్మతులు చేయించకపోవడంతో నీటి ఎద్దడి నెలకొందని పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి స్థానికులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బీమా చెక్కు అందజేత

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామానికి చెందిన మాద్రె ప్రభాకర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ప్రభాకర్ మిర్జాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యుడు.. ఆయన రుణం తీసుకున్న సమయంలో బీమాకు ప్రీమియం చెల్లించాడు. బీమా కంపెనీ ద్వారా రూ.2లక్షలు మంజూరవగా మంగళవారం భైంసాలోని మిర్జాపూర్ పీఏసీఎస్‌లో మృతుడి భార్య రత్నకు చెక్కు అందించారు. పీఏసీఎస్ చైర్మన్ ఆమెడ దేవేందర్‌రెడ్డి, డైరెక్టర్లు శ్రీనివాస్, చంద్రకాంత్‌రెడ్డి, కె.సాయినాథ్, శ్రీనివాస్, బ్యాంకు సూపర్‌వైజర్ అభిలాశ్‌గౌడ్, రాజేందర్, శ్రావణ్, సురేశ్, శివ తదితరులు ఉన్నారు. అహ్మద్ అభినందించారని అన్నారు. ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ రాజేందర్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు

ముధోల్: నిర్మల్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో ముధోల్ రబీంద్ర పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ సాయినాథ్ తెలిపారు. పాఠశాలకు చెందిన పి.హాసిని, అదీబా తస్నీమ్ వైజ్ఞానిక ప్రదర్శనలో రెండో స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. వీరిని డీఈవో రవీందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అభినందించారని అన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

తానూరు: మండల కేంద్రంలోని భవిత విద్యావనరుల కేంద్రంలో మంగళవారం దివ్యాంగులైన విద్యార్థులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. 22 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించినట్లు ఫిజియోథెరపిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఐఆర్‌టీ భూమన్న, రాము, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

నిర్మల్‌రూరల్: నిర్మల్ మాజీ ఎంపీపీ సాదా సుదర్శన్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం ఆయనను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాకాల రాంచందర్, నాయకులు పరామర్శించారు. ఆయనకు ఇటీవల బైపాస్ సర్జరీ జరుగగా.. కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎం.శ్రీనివాస్, చంద్రగౌడ్ తదితరులున్నారు.

మత్తుపదార్థాలతో జీవితాలు నాశనం



మాట్లాడుతున్న పండరి

లోకేశ్వరం: సిగరెట్, బీడీ, గంజాయి వంటి మత్తుపదార్థాలకు బానిసలుగా మారితే జీవితాలు నాశనం అవుతాయని సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ముధోల్ నియోజకవర్గ డైరెక్టర్ డాక్టర్ సాప పండరి అన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గౌతం, ముధోల్ నియోజకవర్గం వైస్ చెర్మన్ పెంటాజీ, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, నవీన్, చిన్నయ్య, విఠల్, సాయినాథ్, ప్రమీల, హరీశ్ ఉన్నారు.

పోరాటాలకు చిరునామా పీడీఎస్‌యూ



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

నిర్మల్‌టౌన్: త్యాగాలు, పోరాటాలకు పీడీఎస్‌యూ (ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం) చిరునామాగా నిలుస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సింగరి వెంకటేశ్ అన్నారు. పీడీఎస్‌యూ 50 ఏళ్ల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవనంలో పూర్వ, ప్రస్తుత విద్యార్థులు స్వర్ణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1974 నుంచి పీడీఎస్‌యూ విద్యారంగ సమస్యలపై శాస్త్రీయ విద్యాసాధనకు, సమ సమాజ స్థాపనతోపాటు విద్యాప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పీడీఎస్‌యూ పోరాడుతుందని పేర్కొన్నారు. ఈ 50 ఏళ్ల ప్రస్తావనంలో జార్జిరెడ్డి, జంపాల, చంద్రశేఖర్, ప్రసాద్, కోల శంకర్, చేరోలు, వీరన్న, రంగవల్లి, యానాల వీరారెడ్డి వంటి విద్యార్థి రత్నాలు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్, శంకర్, మాసుకోల తిరుపతి, బాపూరావు, రాజ్, రాజాలింగం, శ్రీను, రాజేందర్, వెంకట్, నారాయణ, గణేశ్, రాజేశ్, హరిత, కళావతి, సాయన్న, రాజలింగం, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

మందులు అతిగా వాడొద్దు

- డీఏవో అంజిప్రసాద్



కల్లూరులో వరి పంటను పరిశీలిస్తున్న డీఏవో అంజిప్రసాద్, అధికారులు, రైతులు

కుంటాల: వ్యవసాయాధికారుల సూచనల మేరకే పంటల సాగులో మందులు, ఎరువులు వినియోగించాలని.. అతిగా వాడితే అనర్థమేనని డీఏవో అంజిప్రసాద్ సూచించారు. మంగళవారం మండలంలోని కల్లూరులో సాయిరాం అనే రైతుకు చెందిన వరి, సోయా పంటలను పరిశీలించారు. ఆయా పంటలకు అగ్గితెగులు, పాముపొడ ఆశించడంతో రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో సోయా పంట కోత దశకు చేరిందని.. సందేహాలుంటే స్థానిక వ్యవసాయాధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు. వారి వెంట భైంసా ఏడీఏ వీణ, ఏఈవో గణేశ్, రైతులు సాయిరాం, రాజశేఖర్ రెడ్డి, రజనీకాంత్ పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు



మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, నాయకులు

ఖానాపూర్/కడెం: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మల్లేశ్, బొడ్డు గంగన్న, భూమేశ్, లచ్చన్న, సలీం, భూషణ్, వెంకన్న ఉన్నారు.

ఖానాపూర్‌శాఖ సేవలు ప్రశంసనీయం



మాట్లాడుతున్న సంస్థ చైర్మన్ శోభ

ఖానాపూర్: జిల్లాలోనే ఖాతాదారులకు ఉత్తమ సేవలు అందిస్తున్న తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఖానాపూర్‌శాఖ పనితీరు ప్రశంసనీయమని ఆ సంస్థ చైర్మన్ వై.శోభ అన్నారు. పట్టణంలోని బ్యాంక్‌ను నూతన భవనంలోకి మార్చగా వారు ప్రారంభోత్సవానికి హాజరై మాట్లాడారు. ఖాతాదారులు బీమా, పీఎం విశ్వకర్మను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రుణాలు సకాలంలో చెల్లించి బ్యాంక్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ డీవీఎస్ రామారావు, మేనేజర్ అశోక్, అధికారులు, సిబ్బంది రాంగోపాల్, విలాస్, అభినయ్, శ్రీనివాస్, రవీందర్, సాయికృష్ణ, ప్రమోద్, నరేశ్, శేఖర్, కృష్ణంరాజు ఉన్నారు.

రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్

నిర్మల్‌చైన్‌గేట్: బీజేపీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో ఉండేలా కార్యకర్తలు చొరవ తీసకోవాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పదో వార్డులో ఇంటింటా బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్‌లో 200 మందిని కార్యకర్తలుగా చేర్చాలని పేర్కొన్నారు. బుధవారం దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా కార్యకర్తలు సభ్యత్వ నమోదు లక్ష్యం పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ నూతల భూపతిరెడ్డి, ఆనంద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ హయాంలోనే దేశాభివృద్ధి

కుంటాల: బీజేపీ హయాంలోనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ మండల కన్వీనర్ గుద్దేటి నర్సయ్య అన్నారు. మంగళవారం మండలంలోని కల్లూరులో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శ్రమదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు లక్ష్మణ్‌పటేల్, జక్కుల గజేందర్, తాటి శివ, సాయినాథ్‌పటేల్, దత్తురాంపటేల్, కుబీర్ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

లక్ష్మణచాంద: చిన్నారులు బాలింతలు, గర్భిణులు తప్పనిసరిగా ప్రభుత్వం అందించే పోషకాహారం తీసుకోవాలని వైద్యసిబ్బంది కోరారు. పోషణ మాసోత్సవంలో భాగంగా మంగళవారం మండలంలోని బోరిగాం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాధ, ఎంపీవో అమీర్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శి మమత, అంగన్‌వాడీ టీచర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ దినోత్సవం



మొక్క నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

కడెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. జాతీయ సేవా పథకం ప్రాముఖ్యత, ఎన్ఎస్ఎస్ వలంటీర్ల బాధ్యతలను అధ్యాపకులు వివరించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజన్న, ఎన్ఎస్ఎస్ పీవో స్వామి, సిబ్బంది తదితరులున్నారు.

భైంసా డిగ్రీ కళాశాలలో..

భైంసాటౌన్: పట్టణంలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కర్రోల్ల బుచ్చయ్య మాట్లాడుతూ విద్యార్థులు సేవా దృక్పథం అలవర్చుకోవాలన్నారు. అనంతరం వారితో సేవా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్లు రాజు, డాక్టర్ జాదవ్ ఓంప్రకాశ్, వైస్ ప్రిన్సిపాల్ రఘునాథ్, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.